క్లుప్తంగా

'సదరం' గడువు పొడిగించాలి

తిరుమలాయపాలెం: సదరం సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్ బుకింగ్ గడువును పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మందడి ఇబ్రాయిల్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాధికారులను కోరారు. సదరం క్యాంపులు ఉన్నప్పుడు ప్రతీ గ్రామ పంచాయతీల్లో దండోరా వేయించాలని, ఒక్కో నియోజకవర్గానికి ఒక రోజు సదరం క్యాంపు నిర్వహించి వికలాంగులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదు

ఖమ్మంసహకారనగర్: ఏ సమస్యకైనా ప్రాణాలు తీసుకోవడం పరిష్కారం కాదని ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ పెండ్ర అన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యాన ఆత్మహత్యల నివారణ, విద్యార్థుల్లో నిరాశ నిస్పృహలను పారద్రోలే ఉద్దేశంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసుల మరణాలు ఎక్కువగా ఆత్మహత్యలే ఉన్నాయని, ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కాదన్నారు. ఈ కార్యక్రమంలో స్పందన ఫౌండేషన్ చైర్మన్ శామ్యూల్‌రెడ్డి, జ్యోతిర్మయి, చంద్రికారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్‌తో పాటు కె.విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

నేలకొండపల్లి: భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అంబేడ్కర్ దమ్మ యాత్ర కరపత్రాలను శనివారం ఎంపీడీఓ కె.జమలారెడ్డి ఆవిష్కరించారు. కేరళలో ప్రారంభమైన యాత్ర, అక్టోబర్ 15న నేలకొండపల్లికి చేరుకుంటుందని, ఈ యాత్రలో సకల జనులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్, ఈదయ్య, ఆనందరావు, శ్రీకాంత్, హనుమంతరావు, బాలస్వామి, వెంకన్న, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

డెంగీని నివారించాలి

కూసుమంచి: సమష్టి కృషితో డెంగీని నివారించాలని ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్ కోరారు. శనివారం డెంగీ నివారణపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి డెంగీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే ఆరోగ్య ఉప కేంద్రాల్లో తగు చికిత్స అందించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీఓ రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కూలీ బంధు' ప్రకటించాలి

నేలకొండపల్లి: వ్యవసాయ కూలీలకు తెలంగాణ ప్రభుత్వం కూలీ బంధు పథకం ప్రకటించాలని సంఘం రాష్ట్ర నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక రావెళ్ల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ ధరలు పెంచాలని కోరారు. కేంద్రం కూలీ నోట్లో మట్టి కొడుతున్న కేసీఆర్ మాట్లాడకపోవటం దారుణం అన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌స్వేతకు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకుడు కే.వీ.రెడ్డి, దుగ్గి వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, మురళీకృష్ణ, రమాదేవి, రాణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ఎదుగుదలకు అవేర్‌నెస్ అవసరం



మాట్లాడుతున్న బాలుప్రవరాఖ్య

ఖమ్మంరూరల్: విద్యార్థినులకు కెరీర్ ఎదుగుదలకు అవేర్‌నెస్ సామర్థ్యాలతో అవకాశాలు పుష్కలంగా ఉంటాయని టాస్క్ రిసోర్స్ పర్సన్ బాలుప్రవరాఖ్య అన్నారు. మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినుల్లో కావాల్సిన మెళకువలు, నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం తదితర వాటిపై అవగాహన కల్పించడం కోసం ఈకార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మారుతున్న టెక్నాలజీపై నిత్యం అధ్యయనం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్, డైరెక్టర్ ఎ. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మార్క్ అంటోని
వినోద	ది నన్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	7జీ బృందావన కాలనీ
శ్రీనివాస	జవాన్

- ఖమ్మంగాంధీచౌక్

అంతర్గతం.. అద్భుతం!

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అంతర్గత రోడ్లకు మహర్దశ..

- హాస్టళ్లను అనుసంధానిస్తూ సీసీ రోడ్లు
- తీరనున్న వాహనచోదకుల ఇబ్బందులు
- కళాశాలతో పాటు ఆస్పత్రికీ కొత్తరూపు



మెడికల్ కళాశాలలోని అంతర్గత రోడ్లు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు అనుబంధంగాఉన్న వైద్యశాలలో అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టారు. మెడికల్ కళాశాలలో రోడ్లు పూర్తికాగా.. వైద్యశాలలో రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతానికి మట్టి తవ్వి కంకర వేస్తున్నారు. అంతేకాక విద్యార్థుల హాస్టళ్లను కూడా అనుసంధానిస్తూ సీసీ రోడ్లు వేయడంతో ఆస్పత్రితో పాటు కళాశాలకు కొత్త రూపు సంతరించుకుంది.

రూ.166 కోట్లతో ఆధునికీకరణ..

ఖమ్మం కేంద్రంలో మెడికల్ కళాశాల కోసం పాత కలెక్టరేట్, ఆర్అండ్‌బీ, పాత డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని కేటాయిస్తూ గత ఏడాది రూ.166 కోట్ల నిధులతో మెడికల్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈనేపథ్యాన ప్రభుత్వ ఆస్పత్రితో కలుపుకొని సుమారు 30 ఎకరాల స్థలంలో ఏడు నెలల కాల వ్యవధిలో ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రారంభించారు. ఈ క్రమంలో 100 మంది విద్యార్థులు చేరగా.. వారికి బోధన తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.

గతుకులతో గుబేలు..

గతంలో అంతర్గత రోడ్లు గుంతలమయం కావడంతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. దీంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి మెడికల్ కళాశాలలో అంతర్గత రోడ్లు పూర్తి చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలోని రోడ్లు కూడా ఏ చిన్నపాటి వర్షానికైనా నీళ్లు చేరి అధ్వానంగా తయారయ్యేవి. దీంతో ఆస్పత్రికి వచ్చే వైద్యులు, సిబ్బంది, రోగుల ఇబ్బంది పడుతుండడంతో ఆస్పత్రిలో కూడా రోడ్లు వేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆస్పత్రి ఎదుట భాగంలో మట్టి తవ్వి కంకర వేశారు.



ఆస్పత్రిలో కంకర దశలో ఉన్న నిర్మాణ పనులు

రూ.3.25 కోట్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి..

విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు ఆస్పత్రి, కళాశాలను అనుసంధానం చేస్తూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నారు. అందుకోసం ప్రభుత్వం రూ 3.25 కోట్ల నిధులు కేటాయించగా.. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈనేపథ్యాన గర్ల్స్ హాస్టల్‌కు పాత ఆర్అండ్‌బీ భవనాన్ని, బాయ్స్ హాస్టల్‌కు పాత డీఎంహెచ్ఓ కార్యాలయాన్ని కేటాయించారు. కాగా, బాయ్స్ హాస్టల్ నుంచి ఆస్పత్రిలోకి సీసీ రోడ్లు నిర్మించారు. అలాగే, గర్ల్స్ హాస్టల్ నుంచి మెడికల్ కళాశాలను అనుసంధానిస్తూ సీసీ రోడ్డు వేశారు. దీంతో కళాశాల ఆవరణమంతా కొత్తరూపు సంతరించుకుంది.

ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కందాళ

ఖమ్మంరూరల్: ప్రభుత్వం మంజూరు చేసే రూ.కోట్ల నిధులతో గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మంగళగూడెంలో రూ.75 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మంజూరైన నిధులతో పనులు నాణ్యతగా చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

మండలంలోని కామంచికల్ గ్రామానికి చెందిన పలువురు సీపీఐ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా.. వారికి గులాబీ కడువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తొండల సత్యనారాయణ, శ్రీనివాస్, బి.ఉపేందర్, దాదామియా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడి



అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

కూసుమంచి: కూసుమంచిలోని పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని శనివారం అంగన్‌వాడీ సిబ్బంది ముట్టడించారు. ఈనేపథ్యాన పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బి.కోటేశ్వరీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీలతో వెట్టి చాకిరీ చేయిస్తూ.. కనీస వేతనం అమలు చేయడంలేదని ఆరోపించారు. అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని, నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పెరుమాళ్లపల్లి మోహన్‌రావు, నాయకులు వీరన్న, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుధారాణి, కార్యదర్శి ఉమాదేవి, తిరుమలాయపాలెం ప్రాజెక్టు అధ్యక్ష,కార్యదర్శులు మంజుల కుమారి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

దళితులను మరోసారి మోసం చేయొద్దు



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

తిరుమలాయపాలెం: సర్వేల పేరుతో దళితులను మోసం చేయకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ దళిత బంధు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కాకరవాయిలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా, ఇప్పుడు దళిత బంధు పేరుతో మరోసారి దళితులను మోసం చేయాలని చూస్తుందని పేర్కొన్నారు.గృహలక్ష్మి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గడ్డం శ్రీనివాసరెడ్డి, లింగయ్య, సత్యం, ఈదయ్య, సైదులు, యాదగిరి, శ్రీను నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గిరిజన సంఘం నాయకులు



గిరిజన సంఘం నాయకులతో పోలీస్

తిరుమలాయపాలెం: అర్హులైన గిరిజన ప్రజలకు గృహ లక్ష్మి, ట్రైకార్ నిధులు తక్షణమే అందించి న్యాయం చేయాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కోఆర్డినేటర్ గుగులోత్ సురేష్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిస్తే పోలీసులు అర్ధరాత్రి సమయాన అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. గిరుజనులకు పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ నిధులను వెంటనే విడుదల చేయాలని, గృహలక్ష్మి పథకాన్ని అమలు చేసి అర్హులందరికీ ఇళ్లను ఇవ్వాలని కోరారు. ప్రతి తండాలో సేవాలాల్ మహారాజ్ విగ్రహాలను ఏర్పాటు చేసి జయంతి ఉత్సవాలు జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల అధ్యక్షుడు ధరావత్ వెంకన్ననాయక్, మండల కార్యదర్శి భాస్కర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న వీవీ అప్పారావు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం హిందూ స్మశాన వాటిక, నేత్రనిధి, మధ్యాహ్న నిత్యాన్నదాన నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం నగరంలోని త్రీటౌన్‌లో వీవీ అప్పారావు అధ్యక్షతన ఆయా సంఘాల ఆధ్వర్యాన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యాన సంఘ కార్యకలాపాలపై కార్యదర్శి నివేదికలు వినిపించారు. 2020–23 వరకు కమిటీ నిర్వహణల జమ, ఖర్చులు, ప్రభుత్వ ఆస్పత్రిలో అందించే మధ్యాహ్న భోజనం, ఇల్లెందు క్రాస్ రోడ్‌లో రూ. 47 లక్షలు, ఖమ్మం నేత్రనిధికి రూ. 27 లక్షలతో కొనుగోలు చేసిన ఖాళీస్థలాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా 2023–26 సంవత్సరాలకు గాను శ్మశానవాటిక నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా వీవీ అప్పారావు, అధ్యక్షుడిగా రాయపూడి రంగనాథ్, ఉపాధ్యక్షులుగా డోకుపర్తి రవీంద్రకుమార్, కొంకిమళ్ల విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పి పద్మనాభం, సహాయ కార్యదర్శిగా పుల్లఖండం నాగేందర్‌రావు, కోశాధికారిగా పెనుగొండ శ్రీనివాసరావు, ఎక్స్ అఫీసియో సభ్యులుగా స్థానిక కార్పొరేటర్ వెంకటరావులతో పాటు మరి ఆరుగురిని సభ్యులను ఎన్నుకున్నారు. మధ్యాహ్న నిత్యాన్నదాన కమిటీ అధ్యక్షుడిగా కాళ్ల పాపారావు, ఉపాధ్యక్షులుగా పెరుమాళ్ల శ్రీనివాసరావు, పోలా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పి పద్మనాభం, సలహాదారుగా పెనుగొండ రామ్మోహన్‌తో పాటు మరో నలుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఖమ్మం నేత్రనిధి కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుగా కల్వకుంట్ల గోపాల్‌రావు, వడ్డెబోయిన నర్సింహారావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పి పద్మనాభం, కోశాధికారిగా తూములూరి లక్ష్మీనరసింహారావుతో మరో 7గురు సభ్యులను ఎన్నుకున్నారు. కాగా, శ్మశానవాటికకు ప్రభుత్వం మరో 25 ఎకరాలు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు.

కలెక్టర్‌కు వినతి..



వినతిపత్రం అందజేస్తున్న అఫ్జల్‌హసన్

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: పంచాయతీరాజ్ టెక్నికల్ సిబ్బందికి పే స్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ అఫ్జల్‌హసన్ కలెక్టర్ వీ.పీ. గౌతమ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖలోని టెక్నికల్ వ్యవస్థలో 13 ఏళ్లుగా పని చేస్తున్న సిబ్బందికి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయటంతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే కూసుమంచిలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్‌నాయక్, ఎంపీడీఓ రమాదేవిలకు పలువురు కంప్యూటర్ ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు.

చెరువుమాదారం మత్స్య సొసైటీ అధ్యక్షుడిగా ఖాసిం



నూతన కమిటీతో ఇతర డైరెక్టర్లు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గం కొలువుదీరింది. శనివారం సొసైటీ కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో నూతన కమిటీకి ఎన్నికల అధికారి ప్రసాద్ ఎన్నిక నిర్వహించారు. సొసైటీ ఎన్నికలో మొత్తం 9 డైరెక్టర్లను మాజీ అధ్యక్షుడు ఖాసిం ప్యానల్ గెలుచుకుంది. ఈనేపథ్యాన సొసైటీ అధ్యక్షుడిగా ఎం.డీ.ఖాసిం, ఉపాధ్యక్షుడిగా డి.రాధాకృష్ణమూర్తి, సొసైటీ కార్యదర్శిగా వెన్నబోయిన పృథ్వీరాజ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈమేరకు నూతన కమిటీని తుమ్మా ధనమూర్తి, వి.శ్రీనివాసరావు తదితరులు సన్మానించారు.

గొర్రెల పెంపకందారుల సహకార సంఘం ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కామేపల్లి: మద్దులపల్లి గ్రామంలో శ్రీ గంగా భవాని గొర్రెల పెంపకందారుల సహకార సంఘాన్ని శనివారం యాదవ సంఘ పెద్దలు కాట్రాల రాంబాబు, గడ్డం వీరన్న ఆధ్వర్యాన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా గడ్డం శ్రీనివాస్, సెక్రటరీగా నూకల మల్లయ్య, సభ్యులుగా జాల నాగమణి, మొర్రిమేకల వెంకటమ్మ, బుర్ర లింగస్వామి, జక్కుల లింగస్వామి, కన్నబోయిన నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. అనంతరం సంఘ ఎన్నికల అధికారి రవికుమార్ అధ్యక్షతన నూతన సంఘం ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాట్రాల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సీమంతాలు నిర్వహిస్తున్న సీడీపీఓ, సర్పంచ్

రఘునాథపాలెం: మండలంలోని కోటపాడు గ్రామంలో శనివారం పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన వంటి కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాక ఐసీడీఎస్ సీడీపీఓ కవిత మాట్లాడారు. పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సలహాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాతుల రమణసుధాకర్, ఉప సర్పంచ్ కొంటముక్కల వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ కృష్ణకుమారి, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి

కామేపల్లి: ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌పై పెట్టిన అక్రమ కేసును తక్షణమే ఎత్తివేయాలని ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారి సింహాద్రియాదవ్ డిమాండ్ చేశారు. శనివారం నల్గొండ జిల్లా సూర్యాపేటలోని జానయ్య యాదవ్ నివాసానికి పరామర్శకు వెళ్లిన సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సీటు కావాలని అడిగినందుకు కేసు పెట్టడం దారుణమని, బీసీల ఎదుగుదలను తట్టుకోలేక వారిని అణగదొక్కేందుకు ఇటువంటి అక్రమ కేసులు బనాయిస్తునారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే యాదవులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. వారి వెంట యాదవ సంఘ జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్, భారత, చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు యాదవ్, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ప్రభాకర్, శేఖర్, మురళి పాల్గొన్నారు.

పూజలు.. అన్నదానాలు.. నిమజ్జనాలు

మండపాల్లో కొలువుదీరిన గణేశుడికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమాలు, కుంకుమ పూజల్లో ప్రజాప్రతినిధులతో పాటు భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుంటున్నారు. అనంతరం ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను పలువురు నాయకులు ప్రారంభించి విరాళాలు అందజేశారు. అలాగే ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి బైబై చెబుతూ.. డీజే పాటలు, డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: సారధినగర్ కుంకుమ పూజలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ



గాంధీనగర్‌లో ఏఎంసీ చైర్‌పర్సన్ శ్వేత, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల పూజలు



ఖమ్మంరాపర్తినగర్: విజయనగర్ కాలనీలో జనసేన నాయకుల పూజలు



కామేపల్లి: ఊట్కూర్ బొడ్రాయి సెంటర్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సులోచన



కూసుమంచిలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు



మోతీనగర్ వినాయకుడి నిమజ్జనం..



కామేపల్లి: వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న గిరిజన పాఠశాల విద్యార్థులు



ఖమ్మంఅర్బన్: టేకులపల్లి చిల్డ్రన్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన.. అన్నదానం

వినాయక మండపాలకు విరాళాలు..

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటి కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి నేలకొండపల్లి మండలం, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని బేబీస్వర్ణకుమారి రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలకు విరాళాలు అందించారు. మండపానికి రూ. 5 వేల చొప్పున అందించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు క్లెం వెంకటరెడ్డి, అశోక్‌నాయక్, గోనె భుజంగరెడ్డి, కె.చంద్రశేఖర్, చావా శివరామకృష్ణ, కొడాలి గోవిందరావు, నెల్లూరి భద్రయ్య, వాకా శ్రీనాథ్, సర్పంచ్‌లు పుల్లమ్మ, జ్యోతి, రామకృష్ణ పాల్గొన్నారు.



రాజేశ్వరపురంలో విరాళం అదిస్తున్న ప్రసాదరెడ్డి

దాడి ఘటనపై కేసు నమోదు

కామేపల్లి: ఇరువర్గాల మధ్య జరిగిన దాడి ఘటనకు సంబంధించి ఎనిమిది మందిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బాసిత్‌నగర్‌లో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహిస్తుండగా ఉత్సవ కమిటీలో తమ పేర్లు చేర్చుకోవాలని కొందరు కోరారు. దీనిని పలువురు వ్యతిరేకంగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.